సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
గురువారం, 11.06.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 220
పేజీలు: 06 వెల: రూ. 5


# రైతు భరోసా ఎప్పుడు?

## మూడో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్న రైతులు



- త్వరలో ప్రభుత్వ స్పష్టత
- వానాకాలం నుంచి కఠిన నిబంధనలు
- సాగులో ఉన్న భూములకే పెట్టుబడి సాయం
- భూ వెరిఫికేషన్, శాటిలైట్ మ్యాపింగ్‌కు ప్రభుత్వం సిద్ధం
- అర్హులకే రైతు భరోసా
- బ్యాంకు ఖాతా వివరాలు సరిచూసుకోండి
- చిన్న పొరపాట్లతోనే నిధులు ఆగిపోవచ్చు

**ముద్ర డెస్క్:**
తెలంగాణ రైతులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధుల పంపిణీ ప్రక్రియ ప్రస్తుతం కీలక దశలో ఉంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి ఒక ఎకరం వరకు, అలాగే రెండు ఎకరాల లోపు సాగు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని జమ చేసింది. అయితే రెండు ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు సంబంధించిన మూడో విడత నిధుల విడుదల ఇంకా పెండింగ్‌లో ఉండటంతో వేలాది మంది రైతులు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.
ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, వానాకాలం సీజన్ నుంచి రైతు భరోసా అమలులో మరింత పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో భూముల వివరాల ధృవీకరణ, శాటిలైట్ మ్యాపింగ్, క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టనున్నారు. సాగులో ఉన్న భూములకే పెట్టుబడి సాయం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భూమి ఉన్నప్పటికీ సాగు చేయని ప్రాంతాలను గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే నిధులు చేరేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. మిగతా 02లో


# ఆర్థిక పతనం దిశగా..

## ప్రజలపై ధరాభారం



- హామీలు అమలు చేయకపోతే నిరంతర పోరాటాలు
- కలెక్టరేట్ల ముట్టడిలో కూనంనేని
- ఖమ్మంలో కదంతొక్కిన సిపిఐ శ్రేణులు
- కలెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత

05



## రేవంత్

- ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా ఏది?
- రెండున్నరేళ్ల పాలనలో ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఎందుకు మౌనం?
- బీఆర్ఎస్ చేసిన తప్పిదమే కాంగ్రెస్ కూడా చేస్తోందా?

# వన్ మ్యాన్ ఆర్మీ

## రేవంత్ పైనే ఆధారం.. ఎమ్మెల్యేలపై కాంగ్రెస్‌కు అంచనా లేదా?

- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల బలం ఎంత?
- ప్రజల నాడి పట్టాలంటే ఎమ్మెల్యేల పనితీరుపై ఫోకస్ అవసరం!
- హెచ్చరికలకే పరిమితం.. కాంగ్రెస్ నిర్లక్ష్యం?
- కేసీఆర్‌కు జరిగినదే కాంగ్రెస్‌కూ పునరావృతమవుతుందా?
- రెండున్నరేళ్ల తర్వాత కూడా ఎమ్మెల్యేలపై నివేదిక లేదు?
- రేవంత్ ఇమేజ్ సరిపోతుందా?
- కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయి పరీక్ష మొదలు!

**ముద్ర డెస్క్ :**
తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలైంది. అయితే, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల పని తీరు పై ఒక అధ్యయనం గానీ.. ఒక నివేదిక కానీ వచ్చినట్టు కనిపించడం లేదు. అసలు పార్టీ పరంగా కూడా ఈ తరహా చర్యలు చేపట్టడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వంలో వన్ మాన్ ఆర్మీ వ్యవస్థ నడుస్తుందనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనివల్ల అంతా రేవంత్ చూసుకుంటారు అనే ధోరణి పార్టీ అధిష్టానం లో ఉన్నట్టు స్పష్టమవుతుందని సీనియర్ నాయకులు చెబుతున్నారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ అయినా ఏ పార్టీ అయినా క్షేత్రస్థాయిలో ఉన్న ఎమ్మెల్యేల బలం, వారు అనుసరిస్తున్న తీరు, వ్యవహరిస్తున్న పనితీరు వంటివి ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ బోల్తా పడింది ఇక్కడే. అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో ఎలా ఉన్నప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఉన్న వ్యతిరేకతను ఆయన గమనించలేకపోయారు. మొహమాటలు, బంధుప్రీతి కావచ్చు,, మరో కారణం కావచ్చు, ఏది ఏమైనప్పటికీ ప్రజల్లో మిగతా 02లో





## సుస్థిర మైనింగ్‌లో

# సింగరేణి మైలురాయి

## పర్యావరణ ప్రమాణాల అమలుపై కేంద్రం ప్రశంస

- వడ్డీతో సహా రూ.40 కోట్ల డిపాజిట్ తిరిగి చెల్లించిన కేంద్ర సంస్థ
- డోర్లీ-2 గని మూసివేతలో ఆదర్శంగా నిలిచిన సింగరేణి
- త్వరలో డోర్లీ-1 గనికి సంబంధించి మరో రూ.60 కోట్లకు పైగా వచ్చే అవకాశం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
బొగ్గు గనుల నిర్వహణలో మాత్రమే కాకుండా, గనుల మూసివేత అనంతరం పర్యావరణ పరిరక్షణలోనూ అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్న సంస్థగా సింగరేణి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. బెల్లంపల్లి ఏరియాలోని మిగతా 02లో

## 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్

# పునరుద్ధరణ పూర్తి

## జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి



- సెప్టెంబర్ 2026 నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం
- రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

04

# మీనాక్షిపై ఫిర్యాదు రేవంత్ కుట్ర

## కేసు ఉన్నట్టు చెప్పింది సీఎంయే ఎంపీ ధర్మపురి అర్వింద్



- రేవంత్‌కు చదువు రాదు.. వచ్చే ఎన్నికల్లో ఘోర ఓటమి తప్పదు
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఈజీ..
- త్రిపుర, బెంగాల్ కంటే అవకాశాలు ఎక్కువ
- ధాన్యం కొనుగోలు, రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
- బీజేపీ బలహీనతలను అంగీకరించిన ఎంపీ అరవింద్

05

# మోదీ పుష్కరోత్సవం

## భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం

02

- సుదీర్ఘ ప్రధానిగా మోదీ రికార్డు..
- 4,398 రోజుల నెహ్రూ రికార్డుకు బ్రేక్
- 12 ఏళ్ల మోదీ యుగం..
- భారత్ మండపంలో ఎన్డీఏ శక్తి సమీకరణం
- మోదీ నాయకత్వానికి 12 ఏళ్లు..
- భవిష్యత్ భారత్ దిశగా ఎన్డీఏ మంతనాలు
- 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంగా ఎన్డీఏ సదస్సు..



# ప్రపంచ ఫుట్‌బాల్ సమరం

## నేటి నుంచి ఫిఫా వరల్డ్ కప్–2026..

02

- మూడు దేశాల్లో 104 మ్యాచ్‌ల ఫుట్‌బాల్ పండుగ
- ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు నెల రోజుల జాతర..
- టైటిల్ వేటలో స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లాండ్
- 48 జట్లతో చరిత్రలోనే అతిపెద్ద వరల్డ్ కప్



# ఫ్యూచర్ సిటీని అడ్డుకోవద్దు..

## నగరాన్ని రద్దు చేస్తామంటే ప్రజలు బండకేసి కొడతారు


- రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తారు
- ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు
- అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారు
- కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నరు
- ఏడ్చేవాళ్లు ఏడవాలి.. మేం అభివృద్ధి చేస్తూనే ఉంటాం
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

02



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
భవిష్యత్తు నగరం (ఫ్యూచర్ సిటీ)ని రద్దు చేస్తామంటోన్న నాయకులను తెలంగాణ ప్రజలు బండకేసి కొడతారని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్తు ఉండదని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ(ఎఫ్ సిడిఏ) భవనాన్ని ప్రారంభించిన సీఎం... ఎఫ్ సిడిఏ లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు.

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 11.06.2026
www.mudranews.in | @mudranews



**నోటి దుర్వాసన: 2 పూటలా బ్రష్ చేయడం**



రోజుకు రెండుసార్లు (ఉదయం, రాత్రి) ఖచ్చితంగా బ్రష్ చేయాలి. ఇది పండ్ల మధ్య పేరుకుపోయే ఆహార కణాలు, బ్యాక్టీరియాను తొలగించి నోటిని శుభ్రంగా ఉంచుతుంది.

## సుస్థిర మైనింగ్ లో సింగరేణి
# మరో మైలురాయి



**(మొదటి పేజీ తరువాయి)**
డోర్లీ–2 ఓపెన్కాస్ట్ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా విజయవంతంగా మూసివేసినందుకు గుర్తింపుగా, గని ప్రారంభ సమయంలో డిపాజిట్ చేసిన సుమారు రూ.40 కోట్ల సొమ్మును వడ్డీతో సహా కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ సింగరేణికి తిరిగి చెల్లించింది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశంలో సింగరేణి సంస్థలో తీసుకుంటున్న పర్యావరణహిత చర్యలకు లభించిన గుర్తింపుగా భావించవచ్చు.
గనుల ప్రారంభం నుంచి మూసివేత వరకు అమలు చేయాల్సిన మైన్ క్లోజర్ ప్లాన్, పర్యావరణ పరిరక్షణ చర్యలు, భూసంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలు తదితర అంశాలను సింగరేణి సంస్థ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్, గని ప్రారంభ సమయంలో డిపాజిట్ చేసిన నిధులను ఇటీవల వడ్డీతో సహా తిరిగి విడుదల చేసింది.
డోర్లీ–2 ఓపెన్కాస్ట్ గని మూసివేత ప్రక్రియలో సింగరేణి చేపట్టిన పర్యావరణహిత చర్యలు, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరికి గుర్తింపుగా దాదాపు రూ.40 కోట్ల ఎస్క్రో డిపాజిట్ తిరిగి పొందనుంది. గని ప్రారంభ సమయంలో పర్యావరణ పరిరక్షణ, గని మూసివేత పనుల కోసం అంచనా వ్యయం మేరకు సంస్థలు ముందుగానే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేస్తే ఆ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తారు.
బెల్లంపల్లి ఏరియాలోని డోర్లీ ఓపెన్కాస్ట్–2 గనికి సంబంధించి సింగరేణి 2013–14లో రూ.26.79 కోట్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిపాజిట్ చేసింది. ఏడేళ్లపాటు బొగ్గు ఉత్పత్తి అనంతరం 2023–24లో గనిని మూసివేశారు. గని మూసివేత చర్యలను 2024లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శిబ్‌పూర్ పరిశీలించి అన్ని నిబంధనలు అమలయ్యాయని ధృవీకరించింది.
దీంతో కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ మొత్తం రూ.40 కోట్లలో 90 శాతం అయిన రూ. 36.63 కోట్లను విడుదల చేస్తూ, మిగిలిన మొత్తాన్ని జస్ట్ ట్రాన్సిషన్ నిబంధనల పరిశీలన అనంతరం చెల్లించనున్నట్లు తెలిపింది. సింగరేణి గని తవ్విన ప్రాంతంలో 162.5 హెక్టార్లలో అడవుల పునరుద్ధరణ చేపట్టింది. టాప్‌సాయిల్‌ను భద్రపరచి తిరిగి వినియోగించడంతో పాటు ఓవర్‌బర్డెన్ డంపులపై విస్తృతంగా మొక్కలు నాటింది. ధూళి, వాయు కాలుష్య నియంత్రణకు వాటర్ స్ప్రింక్లర్లు, డస్ట్ కలెక్టర్లు, మిస్ట్ స్ప్రేయర్లు ఏర్పాటు చేసింది. జల కాలుష్యం నివారణకు గార్లాండ్ డ్రైన్లు, చెక్‌డ్యామ్‌లు, సెటిలింగ్ ట్యాంకులు నిర్మించింది. గని ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు, కంచె నిర్మాణం, పాత నిర్మాణాల తొలగింపును కూడా పూర్తి చేసింది. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సింగరేణి చేపడుతున్న శాస్త్రీయ గని మూసివేత చర్యలకు ఇది నిదర్శనమన్నారు. డోర్లీ–1 గనికి సంబంధించిన తనిఖీలు కూడా తుది దశలో ఉండగా, మరో రూ.60 కోట్లకు పైగా డిపాజిట్ తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

# రేవంత్ వన్ మ్యాన్ ఆర్మీ

**(మొదటి పేజీ తరువాయి)**
ఎమ్మెల్యేలకు ఉన్న వ్యతిరేకతను అంచనా వేయలేని కారణంగా కేసీఆర్ తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నారు. ఇప్పుడు రెండున్నర సంవత్సరాలు పూర్తయిన తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరిస్థితి ఏ విధంగా ఉంది అని అంచనా వేసే వ్యవస్థను కూడా కాంగ్రెస్ పార్టీ నడిపించలేకపోతోంది. దీనిపై ఒక్క మాట కూడా చర్చకు రావడం లేదు. ఏదో తూతూ మంత్రంగా రాష్ట్ర స్థాయిలో సమావేశాలు పెట్టడం, హెచ్చరికలు జారీ చేయడం వరకే పరిమితం అవుతున్నారు. అంతే తప్ప ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు.. ప్రజలకు చేరువ అవుతున్నారా లేదా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళుతున్నారా లేదా అనే అంశాలపై ఎక్కడా మానిటరింగ్ చేసే వ్యవస్థ లేకపోవడం గమనార్హం. ఏ ప్రభుత్వానికైనా రెండున్నర సంవత్సరాల పాలన అత్యంత కీలకం. ఈ రెండున్నరేళ్లలో ప్రజల నాడి ఏ విధంగా ఉంది.. అని పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది. దీనికి మూల కారణం ఎమ్మెల్యే వ్యవహరించే పనితీరును బట్టి ఆధారపడుతుంది. ఈ విషయాన్ని గ్రహించారా.. లేకపోతే గ్రహించి కూడా వదిలేశారా.. అనేది చూడాలి. ఏదేమైనా పార్టీ అధిష్టానం కేవలం రేవంత్ రెడ్డి పై ఆధారపడినట్టు స్పష్టంగా తెలుస్తోంది. కానీ వ్యక్తి రాజకీయాలు కొన్నాళ్ల వరకే పని చేస్తాయి. తర్వాత ప్రజల్లో వచ్చే సానుకూలత, సానుభూతి వంటివి మాత్రమే పార్టీలను గెలిపిస్తాయి. దీనికి బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. మరి ఇప్పటికైనా కాంగ్రెస్ మేలుకుంటుందా లేదా అనేది చూడాలి.

# రైతు భరోసా ఎప్పుడు?

**(మొదటి పేజీ తరువాయి)**
అయితే రైతులు కొన్ని కీలక అంశాలపై నిర్లక్ష్యం చేస్తే రైతు భరోసా నిధులు అందకపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతాకు ఈ–కేవైసీ (e–KYC) పూర్తి చేయడం, ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయడం తప్పనిసరి. ఈ ప్రక్రియల్లో ఏదైనా లోపం ఉంటే ప్రభుత్వ నిధులు ఖాతాలో జమ కావడంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అలాగే భూమి రికార్డులు, పట్టాదారు వివరాలు, ఆధార్ సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు అన్నీ సరైనవిగా ఉన్నాయో లేదో రైతులు ముందుగానే పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. భూమి యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు లేదా రికార్డుల్లో పొరపాట్లు ఉంటే కూడా నిధుల విడుదల ఆలస్యం కావచ్చు.
రైతు భరోసా ప్రయోజనాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పొందాలంటే రైతులు తమ బ్యాంకు శాఖలను, వ్యవసాయ అధికారులను సంప్రదించి అవసరమైన ధృవీకరణ ప్రక్రియలను పూర్తి చేసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం త్వరలోనే మిగిలిన విడత నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వనున్న నేపథ్యంలో రైతులు తమ వివరాలను సరిచూసుకుని సిద్ధంగా ఉండాలని సూచిస్తున్నారు.



## ఫ్యూచర్ సిటీని
# అడ్డుకోవద్దు..

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ఆగ్రహించారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు కొందరు యత్నిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ నెల 9న కురిసిన రెండు గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**కబ్జాకోరులపై ఉక్కుపాదం..**
బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదని.. తమ అభివృద్ధి ప్రయత్నం మాత్రం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపుతామని.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ ఉంటుందని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.






# గంజాయి సాగు చేస్తే సంక్షేమంలో కోత

**ముద్ర, అదిలాబాద్ :**
గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని డిజిపి సీవీ ఆనంద్ హెచ్చరించారు. రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని స్పష్టం చేశారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందన్న ఆయన.. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన డిజిపి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోషం గ్రామసభలో ఆయన మీడియాతో మాట్లాడారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందుకే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. దేశ వ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామన్న డిజిపి.. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదన్నారు.

**రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నాం**
**డీజీపీ సీవీ ఆనంద్**





# మోదీ పుష్కరోత్సవం

**ముద్ర డెస్క్ :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకుని, భారతదేశానికి అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచిన సందర్భంగా, బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భారత్ మండపంలో ఒక సమావేశం జరగనుంది. 22 ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు ఒక కీలక సమావేశం కోసం భారత్ మండపంలో సమావేశమవ్వనున్నారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించనుండగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఇతర కీలక కేంద్ర మంత్రులు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో సహా కూటమి భాగస్వాముల నాయకులు కూడా పాల్గొనే అవకాశం ఉంది.

**ఎన్డీఏ సదస్సు అజెండా.. హాజరైనవారు**
కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం 12 ఏళ్ల మైలురాయిని చేరుకుంటున్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశపు అజెండాలో, ప్రయోజనాలు చివరి అంచు వరకు చేరేలా చూసేందుకు ప్రతిష్టాత్మక పథకాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సమీక్ష, 2047 'విక్సిత్ భారత్' రోడ్‌మ్యాప్‌పై సమీక్ష, పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ వంటి అంశాలు ఉన్నాయని నివేదికల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన నాయకత్వంలో భారతదేశ విదేశాంగ విధానంలో ఎన్నో మార్పులు జరిగాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ఈ కాలంలో దేశం ప్రపంచ స్థాయి ప్రతిష్ట, అంతర్జాతీయ ప్రభావం గణనీయంగా విస్తరించాయని కూడా పేర్కొంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, మోదీ నాయకత్వంలో భారతదేశ దౌత్యపరమైన భాగస్వామ్యం, అంతర్జాతీయ సౌర కూటమి ద్వారా వాతావరణ పరిరక్షణ చర్యల నుండి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) వంటి డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల అంతర్జాతీయ విస్తరణ వరకు అనేక కార్యక్రమాలతో గుర్తింపు వచ్చింది.

## అమరావతికి
# కేంద్రం భారీ వరం

**ముద్ర , అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రూ.2,534 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.1,299 కోట్లతో ఆధునిక కేంద్ర ప్రభుత్వ కార్యాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ఇందులో వివిధ కేంద్ర శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలను ఒకే చోట ఏర్పాటు చేసి సుమారు 8,000 మంది ఉద్యోగులకు పని చేసే సౌకర్యం కల్పించనున్నారు. అలాగే రూ.1,234 కోట్లతో 17 ఎకరాల్లో 11 టవర్లతో కూడిన నివాస సముదాయాన్ని నిర్మించనున్నారు. మొత్తం 1,504 క్వార్టర్లు అందుబాటులోకి రానుండగా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వసతి సమస్యకు ఇది శాశ్వత పరిష్కారంగా మారనుంది.
పర్యావరణహిత గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుల్లో బ్యాంకులు, ఏటీఎంలు, పోస్టాఫీస్, క్రెచ్, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సౌకర్యాలు కూడా ఉండనున్నాయి. నిర్మాణ పనులను సీపీడబ్ల్యూడీ చేపట్టనుండగా, 2027 ప్రారంభంలో పనులు మొదలయ్యే అవకాశం ఉంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతి రాజధాని నిర్మాణానికి మరింత వేగం తీసుకురానుంది.



## ప్రపంచ ఫుట్‌బాల్
# మహాసమరం షురూ

**ముద్ర డెస్క్ :**
ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా వరల్డ్ కప్–2026 నేటి నుంచి ప్రారంభమైంది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్త ఆతిథ్యంలో జరుగుతున్న ఈ టోర్నీ జులై 19 వరకు కొనసాగనుంది. మూడు దేశాలు కలిసి నిర్వహిస్తున్న తొలి ప్రపంచ కప్‌గా ఇది చరిత్రలో నిలవనుంది. ఈ సారి 48 జట్లు బరిలోకి దిగడంతో ప్రపంచకప్ మరింత విస్తరించింది. మొత్తం 104 మ్యాచ్‌లు 16 వేదికల్లో జరగనున్నాయి. కొత్త ఫార్మాట్‌తో పోటీలు మరింత ఉత్కంఠ భరితంగా మారనున్నాయి. స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ జట్లు టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతుండగా, అర్జెంటీనా, బ్రెజిల్, పోర్చుగల్ కూడా బలమైన పోటీదారులుగా ఉన్నాయి. భారత్ మరోసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించలేకపోయినా, దేశంలోని ఫుట్‌బాల్ అభిమానులు ఈ మెగా టోర్నీని ఆసక్తిగా వీక్షించేందుకు సిద్ధమయ్యారు. 39 రోజుల పాటు ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి అంతా ఈ ఫుట్‌బాల్ మహాసమరంపైనే ఉండనుంది.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ మార్గనిర్దేశం

**ఘనస ఫార్మా హబ్‌కు అన్ని రకాలుగా అండగా ఉంటాం**
**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**
**ఘనా ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందంతో భేటి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. అక్కడ ఏర్పాటు చేయనున్న ఫార్మా హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సెక్రెటేరియట్‌లో బుధవారం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ–ఘనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామని.. ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్ట్ ఒబువాడుంటానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. అనతికాలంలోనే పారిశ్రామిక రంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సిన్ తయారీ, గ్లోబల్ సప్లయ్ చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు.

### నోటి దుర్వాసన: నాలుకను శుభ్రం చేసుకోవడం

చాలామంది బ్రష్ చేస్తారు కానీ నాలుకను శుభ్రం చేయడం మరుస్తుంటారు. నాలుకపై పేరుకుపోయే తెల్లటి పొర వల్ల కూడా దుర్వాసన వస్తుంది కాబట్టి టంగ్ క్లీనర్‌తో రోజూ నాలుకను శుభ్రం చేసుకోవాలి.



# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే వరకు పోరాటం

**- కాంగ్రెస్ మహాధర్నాలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి: పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. టీపీసీసీ పిలుపు మేరకు అశోక్ టాకీస్ చౌరస్తాలోని గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ పాల్గొన్నారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, అక్కడి నుంచి పాదయాత్రగా అశోక్ టాకీస్ చౌరస్తాకు చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మహాధర్నా ఒక్కరోజు కార్యక్రమం మాత్రమే కాకుండా నిరంతర ఉద్యమానికి నాంది కావాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తోందని విమర్శించారు.

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో, సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అధికంగా ఉన్నప్పటికీ ప్రజలపై అదనపు భారం పడకుండా సమర్థవంతంగా పాలన సాగించిందన్నారు. ప్రస్తుతం అనుభవం లేని పాలన కారణంగా ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని విమర్శించారు.

మతాలు, కులాల మధ్య విభేదాలను పెంచి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశాన్ని సరైన దిశలో నడిపించలేకపోతోందని ఆరోపించారు. పన్నెండు సంవత్సరాల పాలన తర్వాత కూడా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపలేకపోయిందని, మధ్యతరగతి, పేద వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఉపాధి అవకాశాలు కూడా తగ్గిపోయాయని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు గ్రామాలు, బస్తీల స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

దేశానికి సమతుల్యమైన నాయకత్వం అవసరమని, అందరినీ సమానంగా చూసే నాయకుడు దేశానికి కావాలని యెన్నం పేర్కొన్నారు. ఒకే వ్యక్తికి పదేపదే అధికారం ఇవ్వడం వల్ల అభివృద్ధి మందగిస్తుందని, ప్రపంచ దేశాల్లో కూడా నాయకత్వానికి పరిమిత కాల వ్యవధి ఉంటుందని గుర్తు చేశారు. దేశంలో మార్పు అవసరమని, ఈ ఉద్యమం రాబోయే రోజుల్లో మరింత బలపడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనులను పరిశీలించిన కలెక్టర్



ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: తిమ్మాజీపేట మండలం బావాజీపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న చెరువు పూడికతీత, మట్టి తరలింపు పనులను కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చెరువుల పునరుద్దరణ, పూడికతీత పనుల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతున్నాయని తెలిపారు. చెరువుల నుంచి వెలికితీసే సారవంతమైన వండ్రు మట్టిని రైతుల పొలాలకు తరలించడం వల్ల భూమి సారవంతం పెరిగి పంటల దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. చెరువుల పూడికతీతతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో రైతులకు సాగునీటి లభ్యత మెరుగుపడుతుందని అన్నారు.

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాజరు నమోదు, మస్టర్ రోల్స్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు.

అనంతరం పనుల్లో పాల్గొంటున్న కూలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో థియోమ్ కార్యాలయం ప్రారంభం




ముద్ర, తెలంగాణ బ్యూరో: ఏఐ మరియు డేటా భద్రత రంగంలో ప్రముఖ సంస్థ థియోమ్ భారతదేశంలో తన కార్యకలాపాలను విస్తరిస్తూ హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రం ద్వారా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా తన ఆవిష్కరణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది.

హైదరాబాద్‌ను ఇంజనీరింగ్, ఉత్పత్తి అభివృద్ధి, ఆవిష్కరణల కోసం వ్యూహాత్మక కేంద్రంగా ఎంపిక చేసిన థియోమ్, ఈ త్రైమాసికం ముగిసే నాటికి 50 మందికి పైగా ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. డేటా భద్రత, క్లౌడ్ రక్షణ, ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్ల అభివృద్ధిపై ఈ కేంద్రం ప్రధానంగా దృష్టి సారించనుంది.

ఈ సందర్భంగా థియోమ్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ నవీంద్ర యాదవ్ మాట్లాడుతూ, భారతదేశంలో ఉన్న సాంకేతిక ప్రతిభ, ఆవిష్కరణ సామర్థ్యాలు సంస్థ వృద్ధికి కీలకంగా నిలుస్తాయని తెలిపారు. హైదరాబాద్ కార్యాలయం ఏఐ మరియు డేటా భద్రత రంగాల్లో భవిష్యత్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఐకమ్ (తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్) వ్యవస్థాపక సీఈఓ ఫణి నాగార్జున మాట్లాడుతూ, థియోమ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణ కేంద్రంగా ఎంచుకోవడం నగర ప్రతిష్ఠను పెంచుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభ, మౌలిక సదుపాయాలు, అనుకూల విధానాలు సంస్థల వృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

## రోడ్ సేఫ్టీపై పోలీస్-జీహెచ్ఎంసీ సమావేశం




ముద్ర మల్కాజిగిరి: రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ మెరుగుదల మరియు ప్రజా భద్రత బలోపేతంపై దృష్టి సారిస్తూ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారుల సంయుక్త ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ కృష్ణారెడ్డి అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నగర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాయని తెలిపారు. ముఖ్యంగా శానిటేషన్, రోడ్ల పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా భద్రత వంటి అంశాలపై సంయుక్త కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించడం, యాక్సిడెంట్ల నివారణ, వాహనదారులు మరియు పాదచారుల భద్రతను పెంపొందించడం లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. రోడ్డు భద్రత అంశాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ డిసిపి, ట్రాఫిక్ డిసిపిలు మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాల నిర్మూలనకు

## కఠిన చర్యలు తీసుకోవాలి



**- డీవైఎఫ్ఐ వినతి**

ముద్ర, చిట్యాల: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం అలాగే సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు మరింత కఠిన చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ (టెక్నికల్ సర్వీసెస్) వి.వి. శ్రీనివాసరావు, నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్లకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుండటం ఆందోళనకరమని అన్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న డ్రగ్స్ వ్యాపారాన్ని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, బ్యాంకింగ్ మోసాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నేరస్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పంది నరేష్, నాయకులు ఆడెపు రమేష్, గోలి సాయికిరణ్, కూరాకుల బాలు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త

ముద్ర, మల్కాజిగిరి: మల్కాజిగిరి పరిధిలో సంచలన ఘటన చోటుచేసుకుంది. భార్య నిషారాణిని ఆమె భర్త అరుణ్ తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటనలో అరుణ్‌కు మరో వ్యక్తి సహకరించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలుస్తోంది.

స్థానికులు తెలిపిన ప్రకారం.. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కలహాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున మాట్లాడుకుందామని నిషారాణిని పిలిచిన అరుణ్, ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరగడంతో తుపాకీతో కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన నిషా రాణి అక్కడికక్కడే మృతి చెందింది.



కాగా, నిందితుడు అరుణ్ గతంలో అం బర్‌పేట్ ప్రాంతంలో కూడా తుపాకీతో హల్‌చల్ చేసిన ఘటనలో వార్తల్లో నిలిచినట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, ఏసిపి యాదగిరి రెడ్డి, మల్కాజ్గిరి సీఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం

**పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి**



ముద్ర, నారాయణపేట: ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ టీఎస్ ధ్యేయమని ఆ సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి అన్నారు. ఇటీవల మహబూబ్ నగర్ జిల్లాలోని గండీడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 2024 బ్యాచ్ కు చెందిన ఎస్జిటి ఉపాధ్యాయుడు సాయికిరణ్ కు సంఘం తరపున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి నిధుల నుంచి రూ. 1 లక్ష ఆర్థిక సహాయంను బుధవారం అందించి మాట్లాడారు.

ఉపాధ్యాయుల సమస్య ల పరిష్కారం కోసం పిఆర్టిఓ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడంతో జేఏసీ ఆధ్వర్యంలో జరగాల్సిన ఉద్యమ కార్యాచరణను వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులను ఆదుకొని న్యాయం చేయాలన్నారు. పిఆర్ సి, డిఏ, పెం డింగ్ బిల్లుల క్లియరెన్స్ తో పాటు హెల్త్ కార్డులపై స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులు మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు సాధిస్తుందన్నారు. ప్రభుత్వము సర్వీస్ రూల్స్ రూపొందించి అన్ని రకాల ప్రమోషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు.

మద్దూర్ మండల విద్యాధికారి జి.జనార్దన్ రెడ్డి, రాజేందర్, పి. నర్సింహారెడ్డి, భాస్కర్, సూర్య ప్రకాష్, ఎం.రఘువీర్, సత్యనారాయణ రెడ్డి, రాజేంద్ర బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సంఘటన్ సృజన్ అభియాన్ కోఆర్డినేటర్, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమాల ఇన్‌చార్జి రాచమల్ల సిద్దేశ్వర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, డూప్లికేట్ నమోదుల తొలగింపు వంటి అంశాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను సేకరించనున్న నేపథ్యంలో, ప్రతి బూత్‌లో బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జ్ఞాన చైతన్య రథయాత్ర ప్రారంభం

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న జ్ఞాన చైతన్య రథయాత్రను నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహనీయుల ఆశయాల సాధనతో పాటు రాజ్యాంగ ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే జ్ఞాన చైతన్య రథయాత్ర ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మహనీయుల ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడం ద్వారా సామాజిక చైతన్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. యువతలో జ్ఞానం, అవగాహన, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. సమాజ అభివృద్ధికి మహనీయులు చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను ఆచరణలో పెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం కల్పించే ఈ రథయాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: ప్రపంచ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో బుధవారం నేత్రదాన అవగాహన సదస్సు, కంటి ఆరోగ్య పరిరక్షణపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ మాట్లాడుతూ, నేత్రదానం అత్యున్నత దానాలలో ఒకటని, మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప సేవ అని అన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదాన ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ సుష్మ మాట్లాడుతూ, కంటి ఆరోగ్య పరిరక్షణలో విటమిన్–ఏ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మామిడి, క్యారెట్, బొప్పాయి వంటి ఆహార పదార్థాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా కంటి ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల విద్యార్థులు రామానుజన్, దీపిక, ముక్రా, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు పోల శ్రీనివాసులు, గజ్జ భాస్కర్ గౌడ్, సహస్ర, సహజ తదితరులు పాల్గొన్నారు.

**నోటి దుర్వాసన :**
పుష్కలంగా నీరు తాగడంశరీరంలో నీటి శాతం తగ్గితే నోరు పొడిబారి బ్యాక్టీరియా ఎక్కువగా చేరుతుంది. అందుకే రోజూ తగినంత నీరు తాగుతూ ఉంటే లాలాజలం బాగా ఊరి, నోరు ఎప్పటికప్పుడు శుభ్రపడుతుంది.



# ధాన్యం కొనుగోళ్లలో కోతలు జరగలేదు

**ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు**
**రైతుల సంక్షేమమే లక్ష్యంగా రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**
**48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ**
**హమాలీల, గన్నీ బ్యాగుల కొరత ఉన్నప్పటికీ రికార్డు స్థాయిలో కొనుగోళ్లు పూర్తి**
**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోళ్లలో కోతలు జరగలేదని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రబీ 2025-26 సీజన్‌లో జిల్లాలో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 5.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 436 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ, ధాన్యంలో కోతలు జరుగుతున్నాయని, కొనుగోళ్లు సక్రమంగా లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ఈ ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు. మిల్లర్ల వద్ద స్థల సమస్యలు ఎదురైన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు జిల్లాను సందర్శించారని, మిల్లర్లు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించామని చెప్పారు. మొత్తం 81,954 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే రూ.1,075 కోట్లు విడుదల చేశామని, దాదాపు 90 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల ఖాతాల్లో 48 నుంచి 72 గంటల్లోనే నగదు జమ అవుతోందని పేర్కొన్నారు. హమాలీల కొరత, గన్నీ బ్యాగుల కొరత వంటి అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ జిల్లాలో రికార్డు స్థాయిలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి, 47 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లు నిర్వహించగలిగామని మంత్రి వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి ధాన్యంలో 10 కిలోల కోత విధించారని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మంత్రి పేర్కొన్నారు. ఆయనకు సంబంధించిన ట్రక్ షీట్‌ను మీడియా ముందు ఉంచుతున్నామని, మొత్తం 190 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి పూర్తి చెల్లింపులు కూడా చేసినట్లు స్పష్టం చేశారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం మరొకటి లేదని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోళ్లతో పాటు ఇతర పంటల కొనుగోళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేయాలని కోరారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న దిగుబడులు మార్కెట్‌కు వచ్చాయని తెలిపారు. జిల్లాలో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.1,100 కోట్లకు పైగా జమ చేసినట్లు చెప్పారు. ఈ సీజన్‌లో సుమారు 47 వేల టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటించగా, తెలంగాణ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి అన్ని పంటలను కొనుగోలు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో మొక్కజొన్న కొనుగోళ్లు జరగలేదని, తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో భారీ స్థాయిలో కొనుగోళ్లు నిర్వహించామని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో

# అంకితభావం చూపాలి

**డిజిపి సి వి ఆనంద్**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** శాంతి భద్రతల పరిరక్షణలో అంకితభావం చూపాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి.ఆనంద్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును స్వీకరించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు సేవలు ప్రజలు గుర్తుంచుకునే విధంగా, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా అందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమెన్ సేఫ్టీ, సిఐడి, ఏసీబీ డిజిపి చారు సిన్హా, మల్టీ జోన్ ఐజి చంద్ర శేఖర్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, జిల్లా పోలీసు అధికారులు ఉన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం



**ముద్ర, మహాదేవపూర్:** మహాదేవపూర్ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి వ్యాపారస్తులు సహకరించాలని సర్పంచ్ హసీనా భాను కోరారు. మటన్ షాపులను సర్పంచ్ హసీనా భాను మరియు గ్రామ కార్యదర్శి కల్పనలు సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న అశోక్ మటన్ షాప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, పర్యావరణ హితమైన ఆకుల్లో మాంసం విక్రయిస్తున్నదుకాణ యజమాని అశోక్‌ను అభినందించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహితమైన వస్తువులను ఉపయోగించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు..గ్రామంలోని ఇతర వ్యాపారులు కూడా ఇదే విధానాన్ని అనుసరించి ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణానికి సహకరించాలని సర్పంచ్ కోరారు.

# ప్రధాని మోడీ పేరున ప్రత్యేక పూజలు



**ముద్ర, కోరుట్ల:** భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన 4399 రోజులు అనగా భారత ప్రధానిగా అత్యధిక రోజులు నిరంతరాయంగా సేవలు అందిస్తున్న సందర్భంగా మరియు ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని ముందుకు సాగుతున్న ప్రధాని మోడీ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు భారతదేశానికి సేవలు అందించాలని ప్రపంచంలోనే భారతదేశన్నీ ముందంజలో నడిపిస్తూ ఉండాలని కోరుట్ల పట్టణ వేములవాడ రోడ్డు లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో మోడీ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అలాగే ఈరోజు అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగుతున్న సందర్భంగా పట్టణంలోని రిటైర్డ్ టీచర్ తెలంగాణ ఉద్యమంలో జేఏసి కన్వీనర్ గా ఉద్యమాన్ని ముందుకు నడిపించిన తునికి రాఘవులు, ఎంతోమందికి రక్తదాతగా ఎవరికి రక్తమవసరం ఉన్న ముందుగా గుర్తుకు వచ్చే పేరు కటకం గణేష్ ను సన్మానించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ యాదగిరి బాబు మాట్లాడుతూ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని వారు మన ప్రధానిగా ఉండడం వలన దేశ ప్రజలు సుఖసంతోషాలతో దేశ అభివృద్ధికి తోడ్పడటం ద్వారానే సాధ్యమైందని వారు మరెన్నో సంవత్సరాలు ప్రధానిగా సేవలు కొనసాగించాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు, సీనియర్ నాయకులు రుద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ జిల్లా కార్యదర్శి సుధవేణి మహేష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తిరుమల వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సాగర్, కౌన్సిలర్ గుగ్లావత్ శ్రీకాంత్, సీనియర్ నాయకులు మాసం ప్రసాద్, మాడవేణి నరేష్, సోరుపాక రమేష్, కళాల సాయిచంద్, బెక్కం అశోక్ గుండేటి సంజీవ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్డు సమస్యల పరిష్కారానికి కృషి



**ముద్ర, కోరుట్ల:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని 25వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కలాల రాధ సాయిచంద్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వార్డు సభ మార్కండేయ ఆలయంలో నిర్వహించారు. కౌన్సిలర్ రాధ సాయిచంద్ వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కౌన్సిలర్ తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారులతో కలిసి కౌన్సిలర్ రాధ సాయిచంద్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు ఇతర పంటలపై అవగాహన కల్పించండి

**కలెక్టర్ రాహుల్ శర్మ**




**మహాదేవపూర్, ముద్ర:** వాతావరణ శాఖ సూచన మేరకు ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మహాదేవపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హసీనా భాను అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో విజయవంతంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పూర్తి ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు ఎల్ నినో ప్రభావం ఉన్నందున వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం అవగాహన కల్పించాలని ఇందుకు సహకరించాలని తెలిపారు. అలాగే నానో యూరియా వినియోగించేలా రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. నానో యూరియా వలన తక్కువ మోతాదులో ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు సవరణ జూన్ 15 నుండి జరుగుతున్నదని తెలిపారు. ప్రతి ఇంటికి బూత్ స్థాయి అధికారులు వస్తారని ఓటర్లు వివరాలను ఇవ్వాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా సలహాలు సూచనలు అభ్యంతరాలు ఉన్నట్లయితే తహసిల్దార్ కు లిఖితపూర్వకంగా అందజేయాలని తెలిపారు. వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని సద్విని యోగం చేసుకోవాలని సూచిం చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఆర్డీఓ రవీందర్, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో రవీంద్రనాథ్, వ్యవసాయ శాఖ ఏడిఎ శ్రీ పాల్, సిడిపిఓ రాధిక, పిఆర్ డిఈ సాయిలు, వైద్యాధికారి సుష్మిత, అటవీశాఖ ఎఫ్డిఓ రవి, విద్యుత్తు, సర్పంచ్ శిరీష, వార్డు సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

వరదలు రాకుండా

# ముందస్తు చర్యలు తీసుకోవాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలువ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. గతంలో వర్షాలు కురిసి నీటిమయమైన శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తా, విశ్వనాథ్ పేట్, సిద్దాపూర్ వాగు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో పట్టణంలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండరాదన్నారు. అధికారులు వర్షాకాలం పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణ ప్రజలకు వరద నీటి వల్ల ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. డ్రైనేజీలు, నాళాలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పూడికలు తీసివేస్తూ నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

2027 వేసవి నాటికి

# మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

**జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి**
**సెప్టెంబర్ 2026 నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం**
**నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం**
**రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, మహదేవపూర్** :కాళేశ్వరం ప్రాజెక్టులోని మెడిగడ్డతో పాటు మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షల పురోగతిని ఆయన పరిశీలించారు.జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు నివేదికలు పంపుతామని చెప్పారు. వాటి సూచనల మేరకు సెప్టెంబర్ నాటికి డిజైన్లు ఖరారు చేసి, నవంబర్ లేదా డిసెంబర్‌లో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.మెడిగడ్డ బ్యారేజ్ దెబ్బతినడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, నిర్మాణ లోపాలే కారణమని ఉత్తమ్ ఆరోపించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేయడంతో వ్యయం భారీగా పెరిగిందని విమర్శించారు. రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రపంచ స్థాయి నిపుణులతో కలిసి పునరుద్ధరణ చేపడుతున్నామని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలు అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**ముద్ర, బోథ్:** ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని అటవీశాఖ బోథ్ రేంజ్ అధికారి కవిత అన్నారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక భాగంగా బుధవారం బోథ్ మండలం కౌట- బి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అటవీ శాఖ సౌజన్యంతో మొక్కలను నాటారు. అనంతరం అటవీ శాఖ రేంజ్ అధికారి కవిత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడడం ద్వారా ప్రకృతి సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ హెచ్చరించారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆమె అన్నారు. అలాగే వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు వసంత్, నాగారావు, బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు వెండి పృథ్వీ, అబ్దుల్ రావుఫ్, రమణ గౌడ్ గొడిసెల తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 11.06.2026
www.mudranews.in | @mudranews



**నోటి దుర్వాసన :** లవంగాలు లేదా యాలకులు నమలడం భోజనం చేసిన తర్వాత నోటి దుర్వాసన రాకుండా ఉండటానికి ఒక లవంగం లేదా యాలకను నోట్లో వేసుకుని నమలవచ్చు. వీటిలో ఉండే యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలోని బ్యాక్టీరియాను చంపి, తక్షణ తాజాదనాన్ని ఇస్తాయి.



# ఆర్థిక పతన దిశగా దేశం

**ప్రజలపై ధరాభారం**
**హామీలు అమలు చేయకపోతే నిరంతర పోరాటాలు**
**-కలెక్టరేట్ల ముట్టడిలో కూనంనేని**
**-ఖమ్మంలో కదంతొక్కిన సిపిఐ శ్రేణులు**
**-కలెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** దేశం మోడీ పాలనలో ఆర్థిక పతనం దిశగా సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు.ధరల పెరుగుదలను నిరసిస్తూ, ఎన్నికల హామీల అమలును డిమాండ్ చేస్తూ బుధవారం ఖమ్మంలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వి. వెంకటాయపాలెం స్టేజ్ నుంచి కలెక్టరేట్ వరకు పార్టీ శ్రేణులు ప్రదర్శన చేపట్టగా, కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులతో తోపులాట చోటు చేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని, పేదలపై పన్నులు, ధరల భారాన్ని మోపుతూ సంపన్నులకు భారీ రాయితీలు కల్పిస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, రూపాయి విలువ పతనమైందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం నల్లధనం, ఉద్యోగాల కల్పన వంటి హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. పింఛన్ల పెంపు, రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి అవకాశాలు, పంట బీమా, ఎరువుల ధరల తగ్గింపు వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

# ప్రజలకిచ్చిన ప్రతి హామీలు అమలు

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి**
**తుమ్మల నాగేశ్వరరావు**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు.గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్,మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి

**ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి**
**టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్త్**



**ముద్ర, పోచంపల్లి :** రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెరగాలని, ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్త్ అన్నారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మార్గదర్శకత్వంలో పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖ్ గ్రామంలో రోడ్డు భద్రత గ్రామసభకు ఆమె అతిథిగా హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రజల్లో అవగాహన పెరగడం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్లపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, వేగ పరిమితుల పాటింపు, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు కేవలం ప్రాణనష్టానికే కాకుండా కుటుంబాలకు, సమాజానికి తీవ్ర విషాదాన్ని మిగులుస్తాయని తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రతే లక్ష్యంగా రోడ్డు భద్రతపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌కు చదువు రాదు

**వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఘోరంగా ఓడిపోతాడు**
**వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో లీగల్ గానే, కింద మీద, చేసాయినా అధికారం లోకి వస్తాం**
**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చదువు రాదు.. వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఘోరంగా ఒడిపోతాడని వచ్చే ఎన్నికల్లో తెలంగాణ లో లీగల్ గానే, కింద మీద, చేసి అయినా అధికారంలోకి వస్తామంటూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం సురేంద్రపురి లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తమకు సంబంధం లేదని ఆమె మీద తెలంగాణలో కేసు ఉన్నట్లు అది రేవంత్ కుట్రనో, కాంగ్రెస్ కుట్రనా వారు తేల్చుకోవాలని అంటూ ఎదేవా చేశారు, బిజెపి నాయకుల మధ్య అభిప్రాయబేధాలు సహజం అంటూ కొట్టి పారేశారు. నరేంద్ర మోదీ చరిష్మాను ఓట్లుగా మార్చకోవడంలో తెలంగాణలో విఫలమైందని అంగీకరించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో దొంగతనంగా ఇసుక రవాణాకు లారీలు దొరుకుతాయి, కానీ ధాన్యం రవాణాకు లారీలు దొరకావా అంటూ ప్రశ్నించారు. త్రిపుర, వెస్ట్ బెంగాల్ కంటే తెలంగాణలో బీజేపీ గెలవడం ఈజీ అని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి బ్రదర్స్‌కు మింగడంలో ఉన్న చిత్తశుద్ధి రైతుల పైన లేదు అంటూ ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బొంద ప్రభుత్వం నడుపుతుండు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎఫ్ సి ఐ కి 32 లక్షల టన్నుల బకాయి ఉన్నాడని ధాన్యం విషయంలో ముఖ్యమంత్రి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాడు అని అన్నారు. ధాన్యం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడితే దవడ రాలగొట్టలే అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరు అశోక్ గౌడ్, బీజేపీ నాయకులు పడమటి జగన్మోహన్ రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, శీర్కా సురేష్ రెడ్డి, రత్నపురం శ్రీశైలం, సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకున్న కలెక్టర్




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రెడ్ క్రాస్ సభ్యత్వ డ్రైవ్ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తన ఛాంబర్ లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 17 మండలాల్లో ఉన్న సంబంధిత అధికారులందరూ సేవా దృక్పథం గల ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## దుర్గామాత సన్నిధిలో ఎమ్మెల్యే కుంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణం రాయగిరిలో దుర్గామాత జాతర ముగింపు 16వ పండుగ కార్యక్రమంలో బుధవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తాంగెళ్ళపల్లి రవి కుమార్, కో ఆప్షన్ మెంబెర్ పల్లెర్ల యాదగిరి, వార్డ్ కౌన్సిలర్ పాలతీయ వెంకటేష్, పూర్ణ చందర్ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన లక్ష్యమని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవికుమార్ అన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణలో భాగంగా భువనగిరి పట్టణంలో నిర్వహించిన 35 వార్డు సభలో మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, పట్టణ సీఐ సురేష్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజాపాలన ప్రధాన ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో అభయ హస్తం 6 గ్యారంటీలను గడప గడపకు చేర్చుతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని త్రాగునీటికి ఇబ్బంది లేకుండా వార్డులలో బోర్లు వేయించామనీ, పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించుకొని వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటియాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగళ్ళ పల్లి రవికుమార్, దేవరకొండ జనార్దన్, షరీఫ్ హమీద్ జహంగీర్, మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది, వార్డు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలి

**సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రోడ్డు భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అక్షాంష్ యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీలు, ఇంజనీర్లు, రవాణా అధికారులు పాల్గొన్న సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, కౌన్సెలింగ్లు ఇవ్వాలని సూచించారు. విద్యా సంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాలలో డ్రగ్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 11.06.2026
www.mudranews.in | @mudranews



## నోటి దుర్వాసన: మౌత్ వాష్ ఉపయోగించడం

గోరువెచ్చని ఉప్పు నీటితో లేదా మంచి ఆల్కహాల్ లేని మౌత్ వాష్‌తో నోటిని పుక్కిలించాలి. ఇది పళ్లు, నాలుకకు అందని కణాలలో దాగి ఉన్న బ్యాక్టీరియాను సమర్థవంతంగా తొలగిస్తుంది.





## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక కార్యక్రమం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు" ను పురస్కరించుకొని, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలోని ములుగు మండలం కరకపట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో 21 ఇండస్ట్రీస్ ప్రతినిధులతో ఎన్విరాన్మెంటల్ అవేర్నెస్ ప్లాస్టిక్ ఫ్రీ కం పేస్ ఇంటరాక్షన్ విత్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ కామర్స్ మరియు ఇండస్ట్రీస్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ అనర్థాలు, ఆల్టర్నేటివ్ ఎన్విరాన్మెంటల్ ఐటమ్స్ గూర్చి వర్క్ షాప్ నిర్వహించారుడ.

ఈ వర్క్ షాప్ లో కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త పి.రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భావితరాలకు మంచి గాలి నీరు నేలని పర్యావరణాన్ని, ప్లాస్టిక్ ఫ్రీ పర్యావరణాన్ని భావితరాలకు అందించాలని తెలిపారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఇండస్ట్రీ అసోసియే రిప్రజెంటేషన్ కూడా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ బ్యాగులకు బదులు నార సంచులు, బట్ట సంచుల క్లే పాత్రలు, గ్లాసెస్, వుడెన్, స్పూన్స్ ఉపయోగిస్తామని తద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతామని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి




**- కేంద్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ శిఖ గొయల్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదలను నీవరించాలని తెలంగాణ కేంద్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, డీజీపీ శిఖ గొయల్ అన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా సిద్దిపేట పోలీస్ కన్వీనన్ లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్, అలైవ్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో 8 వేల మంది వరకు మరణిస్తున్నారని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి మరణాలను అరికట్టవచ్చని తెలిపారు.

## కార్డెన్ సెర్చ్.. 45 వాహనాలు సీజ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 70 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 45 వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేశారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... నేరాల నిర్మూలన, ప్రజల రక్షణ, భద్రతాభావం కల్పించడంలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు లేదా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు ఆశ్రయం పొందుతున్నారా అనే విషయాలను గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అద్దెకు ఇల్లు తీసుకోవడానికి వస్తే వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, రాజశేఖర్ రెడ్డి, జార్జ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు

## 'రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి'

**ముద్ర, కూకట్ పల్లి:**

ఉషముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మ బండ మీదుగా గాజులరామారం వరకు చేపడుతున్న 100 అడుగుల ప్రధాన రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులను మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టామని తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్న బండరాళ్లు, విద్యుత్ స్తంభాలను త్వరగా తొలగించాలని, దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు సమయం, ఇంధనం ఆదా అవుతాయని ఆయన పేర్కొన్నారు.

# జిల్లాలో 6, 515 మెట్రిక్ టన్నుల యూరియా ఉంది

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లాలో సరిపడ యూరియా 6,515 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువుల నిల్వలు చేరవేశామని కలెక్టర్ వివరించారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో తనిఖీల పర్యవేక్షణ కోసం 24 టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కొల్చారంలోని మల్లిఖార్జున ఎరువుల దుకాణంకు స్టాక్ సేల్స్ విషయంలో నోటీసులు జారీచేశామని తెలిపారు.

### 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరగడం వల్ల ఇప్పటివరకు 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడిందన్నారు. గత సంవత్సరంతో పోల్చితే ధాన్యం రాక అధికంగా ఉండటం వల్ల రవాణా, అన్‌లోడింగ్, నిల్వల నిర్వహణపై అదనపు ఒత్తిడి ఏర్పడినప్పటికీ, కొనుగోలు ప్రక్రియ ఎక్కడా నిలిచిపోలేదని స్పష్టం చేశారు. రైతుల ఖాతాల లో రూ.720 కోట్లు నేరుగా జమ చేయడమైనది. గత సంవత్సరంతో పోల్చితే ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం రాక గణనీయంగా పెరిగినందున కొనుగోలు కేంద్రాలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలపై అదనపు భారం ఏర్పడిందన్నారు.

అకాలవర్షాల కారణంగా తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతులు ఎలాంటి ఆందోళనకు లేదా అధైర్యానికి గురికావలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు మరియు మార్గదర్శకాల మేరకు వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయుటకు చర్యలు కొనసాగుతున్నవి. రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉన్నదని తెలియజేయడమైనది. మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వేగవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సుమారు 95 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన కొనుగోలు ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు మరియు రవాణా శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని తెలిపారు.



## సివిల్ సప్లయీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

**- బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట పట్టణంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని పలుమార్లు జిల్లా సివిల్ సప్లయీస్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ, సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తూ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం లేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ మండిపడ్డారు. ఈ మేరకు సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ని కలిసి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ అక్రమంగా గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్న వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత వ్యక్తులపై గానీ, గ్యాస్ ఏజెన్సీలపై గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జిల్లా సివిల్ సప్లై అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే అక్రమాలకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా జరుగుతున్న గ్యాస్ అక్రమ వ్యాపారంపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.





## విత్తనాలు, ఎరువుల దుకాణాలలో తనిఖీలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

తెలకపల్లి మండలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాలపై బుధవారం కంబైన్డ్ ఇన్స్పెక్షన్స్ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి. నర్మద, ఎస్సై రమేష్, ఎమ్మార్వో విజయ్‌కుమార్ సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని మన గ్రోమోర్ సెంటర్, మణికంఠ ట్రేడర్స్, బాలకృష్ణ ట్రేడర్స్ విక్రయ కేంద్రాలు, గోదాములను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, రికార్డులను తనిఖీ చేశారు.

తనిఖీల్లో బాలకృష్ణ ట్రేడర్స్‌లో స్టాక్ రిజిస్టర్లలో ఓపెనింగ్ బ్యాలెన్స్ నమోదు సక్రమంగా లేకపోవడం గుర్తించిన అధికారులు, నిబంధనల ఉల్లంఘన కారణంగా స్టాప్ సేల్స్ ఆదేశాలు జారీ చేశారు.

తనిఖీలలో రెక్టిఫై చేయగలిగే ఉల్లంఘనలు మాత్రమే గుర్తించామని, అయితే నాన్-రెక్టిఫైయబుల్ ఉల్లంఘనలు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే 6A కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

విక్రయ కేంద్రాల్లో లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, నేమ్ బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. అలాగే గోదాముల వివరాలు, ఇన్వాయిస్ కాపీలు, ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ప్రతి నిల్వకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వ్యవసాయ ఇన్‌పుట్ల విక్రయంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీలర్లకు అధికారులు సూచించారు.

# రోడ్డు ప్రయాణంలో మార్పులు రావాలి

**- అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



రోడ్డు ప్రయాణం చేయడంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని అడిషనల్ డీజీపి సంజయ్ కుమార్ జైన్ అన్నారు. బుధవారం మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రామసభలో అరైవ్ - అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, పౌరులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడితే రహవీర్ గా గుర్తింపు వస్తుందన్నారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అని అన్నారు.

### ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోరాదు

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**

ఏ ఒక్కరూ ప్రణాలు కొల్పోరాదని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, గ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం, పచ్చదనం, పారిశుధ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని, బహిరంగ ప్రదేశాల్లో అస్సలు చెత్త వేయకూడదన్నారు.

### ప్రాణాలు పోవడం బాధాకరం

**- ఎస్పీ శ్రీనివాసరావు**

ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అంటే రోడ్డుపై ప్రయాణం చేసే సమయంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం అన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణ వ్యాప్తంగా 7500కు పైగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ః జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయని, తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనతో వాహనాలు నడపాలని అన్నారు.

ఈ సందర్భంగా పోలీసు కళాబృందం సభ్యులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు


**- హాజరైన పద్మా దేవేందర్ రెడ్డి, ఫారూక్ హుస్సేన్**

**ముద్ర ప్రతినిధి మెదక్:**

మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను మెదక్ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి ఏడుపాయల దుర్గమ్మ ఆలయం వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయల దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కంఠారెడ్డి తిరుపతి రెడ్డి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం జరిగిన జన్మదిన వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా కంఠారెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ఎలాంటి హోదా, పదవి లేకుండానే ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నా నని తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలు, కార్యకర్తల అండదండలు తనకు మరింత బలాన్నిస్తున్నాయని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు టి. హరీష్ రావు, కె.టి. రామారావు ఆశీస్సులు తనకు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజాక్షేత్రంలో పనిచేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలా గౌడ్, మాణిక్ రెడ్డి, లావణ్య రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No.6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu. Rockdale compound, Somajiguda, Hyderabad-500082 Editor Y Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email mudradailys@gmail.com